క్లుప్తంగా

ఉచిత శిక్షణ సద్వినియోగం చేసుకోండి

పులివెందుల రూరల్ : పట్టణంలోని నేషనల్ అకాడమీ కన్‌స్ట్రక్షన్స్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఎస్సీ నిరుద్యోగ యువతీ యువకులకు పులివెందుల, జమ్మలమడుగు ప్రాంతాలలో డిజిటల్ మార్కెటింగ్ అసిస్టెంట్ ఉద్యోగ అవకాశాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌చార్జి రాకేష్ తెలిపారు. ఈ కోర్సులలో ఉచిత శిక్షణతోపాటు మధ్యాహ్న భోజనం ఉంటుందన్నారు. రెండు నెలలపాటు శిక్షణ ఇచ్చి ఆ రంగాల్లో ఉపాధి కల్పిస్తామన్నారు. ఆసక్తి గలవారు ఈనెల 14తేదీ లోపు పులివెందుల, జమ్మలమడుగు న్యాక్ కేంద్రాలను సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాలకు 9985142155, 9912133531 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

ఆనాథ వృద్ధుడికి అంత్యక్రియలు



అంత్యక్రియలకు మృతదేహాన్ని తరలిస్తున్న ట్రస్ట్ నిర్వాహకులు

ఎర్రగుంట్ల : మండలంలోని తిప్పలూరులో ఉన్న శ్రీ ఎద్దుల పెద్ద శేషమ్మ వృద్ధాశ్రమంలో ఉంటూ జీవనం సాగిస్తున్న ఆనాథ వృద్ధుడు అనారోగ్యంతో మృతి చెందడంతో మృతదేహానికి శనివారం అభి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఆశ్రమ నిర్వాహకుడు నాగేంద్ర, అభి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ విజయబాబ వృద్ధుడికి అంత్యక్రియలు నిర్వహించారు.

పగలే వెలుగులు



బి. కొట్టాలపల్లెలో పగలే వెలుగుతన్న విద్యుత్ దీపాలు

కొండాపురం : మండలంలోని గ్రామాల్లో విద్యుత్ దీపాలు పగలే వెలుగుతున్న పట్టించుకునేవారేలేరు. బి.కొట్టాలపల్లెలో విద్యుత్ స్తాంభాలకు అమర్చిన విద్యుత్ దీపాలకు స్విచ్‌లు లేకపోవడంతో పగలురాత్రి వెలుగుతూనే ఉన్నాయి. కొన్ని గ్రామాల్లో విద్యుత్ దీపాలు వెలగక అందకారంలో ఉన్నాయి. చాలా గ్రామాల్లో పగలే వెలుగుతుండటంతో ప్రజాధనం వృథా అవుతోంది.

చంద్రన్నబీమా జీవోను విడుదల చేయాలి



మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు సుబ్బారెడ్డి

ఎర్రగుంట్ల : చంద్రన్న బీమాకు సంబంధించిన జీఓను వెంటనే విడుదల చేయాలని సీపీఐ నాయకుడు ఎంవీ సుబ్బారెడ్డి తెలిపారు. శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో చంద్రన్న బీమాను రూ.10 లక్షలు పెంచుతామని ప్రచారంలో వాగ్దానం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాడి సుమారు 9 నెలలు కావస్తున్న ఇంత వరకు బీమాపై జీవో విడుదల చేయలేదన్నారు. తక్షణమే జీవోను విడుదల చేసి బాధిత కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

పట్టభద్రుల దినోత్సవం



మాట్లాడుతున్న రిమ్స్ సూపరింటెండెంట్ రమాదేవి

చింతకొమ్మదిన్నె : మండలంలోని పీఆర్‌ఆర్ఎం ఫార్మసీ కళాశాలలో శుక్రవారం రాత్రి ఫేర్వెల్ డే, పట్టభద్రుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో రిమ్స్ సూపరింటెండెంట్ రమాదేవి, రిమ్స్ జనరల్ మెడిసిన్ డాక్టర్ అవ్వారు అర్జున్, రిటైర్డ్ డీఎంహెచ్ఓ వెంకటరమణలు పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నెల్సన్ కుమార్, యాజమాన్య కమిటీ చైర్మన్ ఈశ్వరరెడ్డి, కరస్పాండెంట్ గౌతంరెడ్డి పాల్గొన్నారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టి అలరించారు.

మృత్యుంజయ హోమం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో అరుద్ర నక్షత్రం సందర్భంగా గంగా, రాజరాజేశ్వరి సమేత అగస్త్యేశ్వర స్వామికి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గణపతి, నవగ్రహ, రుద్ర, మృత్యుంజయ హోమాలను నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. ఆలయ కమిటీ చైర్మన్ రఘురామిరెడ్డి, ఈఓ రామచంద్రాచార్యులు, పాలకమండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కరువు వచ్చినా కణికరించని ప్రభుత్వం

- వర్షంలేక పంటలు నష్టపోయిన రైతులు
- కరువు జాబితాలో లేని మండలం
- కనీసం సాయం చేయని ప్రభుత్వం



తెగుళ్లు సోకిన బుడ్డశనగ పంట



అకాల వర్షానికి బుడ్డశనగ పంటకు రాలిన పూత

సింహాద్రిపురం : ఎన్నికల ముందు రైతులపై ప్రేమ ఒలకబోసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పది నెలలు గడిచినా పైసా సాయం చేయకుండా రైతులకు చేయలేదు. సకాలంలో వర్షంలేక రబీలో సాగు చేసిన పంటలన్నీ దెబ్బతిని దిగుబడులు పూర్తిగా తగ్గిపోయాయి. రబీ సీజన్‌లో మండలంలో రైతులు వివిధ రకాల పంటలను సాగు చేశారు. 13,545 ఎకరాల్లో బుడ్డ శనగ, 763 ఎకరాల్లో మినుము, 1098 ఎకరాలలో జొన్న, బోరుబావుల కింద 640 ఎకరాలలో వేరుశనగ పంటలు సాగయ్యాయి. ప్రతికూల వాతావరణ పరిస్థితులు, తెగుళ్లు, చీడపీడలు కారణంగా బుడ్డశనగతోపాటు పంటలన్నీ దెబ్బతిన్నాయి. దిగుబడులు అమాంతం తగ్గిపోయి పెట్టుబడులు కూడా రాక రైతులు అప్పులపాలయ్యారు. అయితే చుట్టుపక్క మండలాలు కరువు మండలాలుగా ప్రభుత్వం ప్రకటించింది కానీ ప్రభుత్వము కరువు మండలాల జాబితాలో సింహాద్రిపురం మండలాన్ని పక్కన పెట్టడంపై రైతులు మండిపడుతున్నారు. ఖరీఫ్, రబీ సీజన్లలో సాగుచేసిన పంటలు అతివృష్టి, అనావృష్టితో ఎక్కువ పంటలు నష్టపోయినా కూడా సింహాద్రిపురం మండలాన్ని కరువు మండలంగా ప్రకటించకపోవడం గమనార్హం. ఎన్నికల ముందు అన్నదాత సుఖీభవ కింద ఇస్తానన్న రూ.20వేలు ఇవ్వలేదు. పంటల బీమా పరిహారం లేదు. రైతు ఆత్మహత్యలకు సంబంధించి బాధిత కుటుంబాలకు పైసా పరిహారం అందించలేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ప్రకృతి వైపరీత్యాలవల్ల జరిగిన పంట నష్టానికి సీజన్ ముగిసేలోపు పరిహారం అందించి ఆదుకున్నారు. క్రమం తప్పకుండా రైతు భరోసా, ఉచిత పంటల బీమా అందించి అన్నదాతలను ఆదుకున్నారు. సాగు చేసిన పంటలన్నీ కళ్ల ముందే ఎండిపోయాయి. దిగుబడులు అరకొరగా వచ్చాయి. సాగుకు అయిన ఖర్చు కూడా రాకపోవడంతో నష్టాలు మిగిలాయి. పూటగడవని స్థితిలో పొట్టకూటి కోసం ఇతర ప్రాంతాలకు రైతులు, కూలీలు వలస వెళ్లారు. అయినా కూటమి ప్రభుత్వం రవ్వంత సాయం చేయకపోగా విడుదల చేసిన కరువు మండలాల జాబితాలో తమ ప్రాంతాన్ని చేర్చకపోవడంపై సింహాద్రిపురం మండలాల రైతులు మండిపతున్నారు.

చీనీ రైతులను ఆదుకోవాలి



చీనీ చెట్లకు పులుసు పురుగు విపరీతంగా సోకడంతో చనిపోతున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి ఎకరాకు రూ.5 వేల నుంచి పదివేల వరకు చీనీ చెట్ల వయస్సును బట్టి నష్టపోయిన ప్రతి రైతుకు నష్టపరిహారం అందించి ఆదుకుంది. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి. ప్రభుత్వం ఆదుకోకపోతే ఆత్మహత్యలే శరణ్యం. ప్రభుత్వం సింహాద్రిపురం మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలి.

– అరవిందనాథరెడ్డి, రైతు సలహాదారుల సంఘం మాజీ అధ్యక్షుడు, సింహాద్రిపురం

తగ్గిన బుడ్డ శనగ పంట దిగుబడి



ఎకరాకు నాలుగు క్వింటాలే బుడ్డ శనగ పంట దిగుబడి వచ్చింది. పంటల సాగులో పెట్టుబడులు రాక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం. 4 ఎకరాలలో బుడ్డ శనగ పంట సాగుకు రూ.లక్ష ఖర్చు చేస్తే 8 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా, కేవలం 4 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. పంటల సాగుకు పెట్టిన పెట్టుబడులతోపాటు దిగుబడులు తగ్గడంతో తీవ్ర నష్టం వాటిల్లింది. అధికారులు పంటల దిగుబడి పరిశీలించి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలి.

– దాదా, రైతు, సింహాద్రిపురం

నేడు శ్రీరాముల వారి కల్యాణం

వేంపల్లె : శ్రీరామనవమి సందర్భంగా ఆదివారం స్థానిక వైఎస్ వివేకానందరెడ్డి కాలనీలో రాములవారి కల్యాణం వైభవంగా నిర్వహిస్తున్నట్లు శ్రీరాముని దేవస్థాన కమిటీ నిర్వాహకులు కొత్తూరు రెడ్డయ్య తెలిపారు. ఉదయం 8 గంటలకు అభిషేకం, 10 గంటలకు శ్రీరాముని కల్యాణం ఉంటుందన్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

నేడు ప్రముఖ వైద్య నిపుణుల రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ క్రాంతికుమార్ మెదడు, వెన్నముక, నరాలు, తిమ్మిర్లు, వంటి ఒళ్లు నొప్పులకు వైద్య చికిత్సలు అందిస్తారన్నారు. కర్నూలు విశ్వభారతి ఆసుపత్రి నుంచి ప్రముఖ గుండె జబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ హితేష్‌రెడ్డి గుండె సంబంధిత జబ్బులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ప్రముఖ క్యాన్సర్ వ్యాధి నిపుణురాలు డాక్టర్ డి.నిహారిక క్యాన్సర్‌పై అవగాహన, స్క్రీనింగ్ క్యాన్సర్ రోగులను క్రమం తప్పకుండా అనుసరించడం, ఇతర క్యాన్సర్ సంబంధిత సంప్రదింపులు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ ఇసీ దినేష్‌రెడ్డి తెలిపారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

పారిశుద్ధ్యంపై దృష్టి సారించండి

వేంపల్లె : వేంపల్లె గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న సిబ్బంది డ్రైనేజీ, పారిశుద్ధంపై దృష్టి సారించాలని పులివెందుల డీఎల్‌పీఓ రమాదేవి సూచించారు. ఇటీవల డ్రైనేజీ, పారిశుద్ధ్యంపై వరుసగా పత్రికల్లో కథనాలు రావడంతో శనివారం ఆమె తనిఖీ చేశారు. గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న సిబ్బందిని పిలిపించి ప్రజలు ఎవరూ ఫిర్యాదు చేసిన డ్రైనేజీ, పారిశుద్ధ్య సమస్యలను పరిష్కరించాలన్నారు. సిబ్బందికి నాలుగు నెలలుగా వేతనాలు ఇవ్వలేదని ఇది వాస్తవమేనన్నారు. ఇక్కడ పనిచేస్తున్న ఈవో వెంకటసుబ్బారెడ్డి అవినీతి ఆరోపణలపై సస్పెండ్ కావడంతో వేతనాలు చెల్లించలేకపోయామన్నారు. త్వరలోనే కొత్త ఈఓను నియమించేందుకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నారని, కొత్త ఈఓ వచ్చిన వెంటనే వేతనాలు చెల్లిస్తామన్నారు. అంతవరకు గ్రామపంచాయతీలో డ్రైనేజీ, పారిశుద్ధ్య సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు.

దోమకాటు.. ఆరోగ్యానికి చేటు



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సిద్ధయ్య

సింహాద్రిపురం : దోమకాటు ఆరోగ్యానికి చేటు అని మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సిద్ధయ్య తెలిపారు. శనివారం బిదినంచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధి గురిజాల గ్రామంలో మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ ఆధ్వర్యంలో ఇంటింటా ఫీవర్ సర్వే, లార్వా సర్వే నిర్వహించి ప్రజలకు దోమకాటు వల్ల వచ్చే వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమ కాటు వలన మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, మెదడువాపు వ్యాధి, ఫైలేరియా వంటి వ్యాధులు వస్తాయన్నారు. డ్రైడే ఫ్రైడే కార్యక్రమం నిర్వహించడంవల్ల దోమల వృద్ధిని అరికట్టవచ్చునన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి సుకుమార్, ఆరోగ్య కార్యకర్త రమాదేవి, ఆశా కార్యకర్తలు రాజా, రంగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఆశాజనకంగా నువ్వుల పంట సాగు



ఆశాజనకంగా ఉన్న నువ్వుల పంట

పులివెందుల రూరల్ : ఈ ఏడాది సాగుచేసిన నువ్వుల పంట అన్నదాతలకు ఆనందం నింపుతోంది. ధరలు కూడా ఆశాజనకంగా ఉండటంతో రైతులు కొంతవరకు సంతోషంగా ఉందని రైతులు చెబుతున్నారు. నూనె గింజల ఉత్పత్తిలో నువ్వుల పంట కూడా ఒకటి. నువ్వుల పంటను ఉష్ణ పంట అని కూడా పిలుస్తారు. ప్రతి ఏడాది వేసవిలో నువ్వుల పంటను ఈ ప్రాంత రైతులకు సాగుచేస్తారు. ఈ ప్రాంత నేలలు నువ్వుల సాగుకు అనుకూలం. గతంలో సాగునీటి సమస్య కారణంగా కొంతమంది రైతులు మాత్రమే నువ్వుల పంటను సాగు చేసేవారు. ప్రస్తుతం కాలువలకు చిత్రావతి నుంచి నీరు రావడంతో చాలామంది రైతులు నువ్వుల పంటపై ఆసక్తి చూపిస్తున్నారని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ఈ పంట పూర్తిగా నీటి ఆవశ్యకతపై ఆధారపడే సాగు చేయాల్సి ఉంటుంది. నువ్వుల పంటకు 5 నుంచి 8 వారాలకొకసారి నీటిని అందించాల్సి ఉందని రైతులంటున్నారు. అలాగే పంటలో సస్యరక్షణ చర్యలు కూడా చేపట్టాల్సి ఉంటుందన్నారు.

ముస్తాబైన ఆలయాలు



లింగాలలోని శ్రీరామాలయం

లింగాల : మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న రామాలయాల్లో ఆదివారం శ్రీరామనవమి వేడుకలు నిర్వహించేందుకు ఆలయాలు ముస్తాబయ్యాయి. ఉదయాన్నే వేద పండితులు శ్రీసీతారామ సమేత ఆంజనేయస్వామి విగ్రహాలకు అభిషేకాలు, అర్చనలు నిర్వహించనున్నారు. గ్రామాల్లోని ప్రజలందరూ స్వామివార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు అందుకుంటారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలను పల్లకిలలో ఉంచి గ్రామంలో గ్రామోత్సవాలు నిర్వహించనున్నారు.

ముందస్తు శ్రీరామనవమి వేడుకలు



లవకుశ వేషధారణలో విద్యార్థినులు

పులివెందుల టౌన్ : పట్టణంలోని శ్రీసరస్వతి విద్యా మందిరం పాఠశాలలో శనివారం శ్రీరామనవమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థినులకు లవకుశల వేషం వేయించి శ్రీరామునికి సంబంధించిన విషయాలు, విశిష్టత గురించి నత్య రూపంలో ప్రదర్శించారు. అనంతరం పానకం, వడపప్పు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్ జీవీ రాజ్యలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే ప్రీ ప్రైమరీ విద్యార్థులకు కలర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు.

ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా చూడాలి



తోపుడు బండ్ల వ్యాపారులకు కౌన్సిలింగ్ ఇస్తున్న ఎస్ఐ విద్యాసాగర్

కమలాపురం : జన సంచారం అధికంగా ఉన్న ప్రాంతాల్లో ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఎస్ఐ విద్యాసాగర్ తెలిపారు. శనివారం స్థానిక క్రాస్ రోడ్డు వద్ద తోపుడు బండ్లు, ఆటో డ్రైవర్లు, వాహన చోదకులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ రోడ్డుపై వాహనాల ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ముఖ్యంగా తోపుడు బండ్లు ఇష్టమొచ్చినట్టు ఎక్కడ పడితే అక్కడ పెట్టవద్దన్నారు. వీలైనంత వరకు రోడ్డు మీదికి రాకుండా తోపుడు బండ్లు పెట్టుకుని వ్యాపారాలు చేసుకోవాలన్నారు. అలాగే ఆటో డ్రైవర్లు క్రాస్ రోడ్డు వద్దకు బస్సులు రాగేనే బస్సు చుట్టూ వస్తున్నారని, ఇది సరికాదన్నారు. మీరంతా క్యూ లైన్ సిస్టమ్ ఏర్పాటు చేసుకుంటే ప్రయాణీకులే మీ వద్దకు వచ్చి ఆటోలు ఎక్కుతారన్నారు. ద్విచక్ర వాహన చోదకులు ముఖ్యంగా రోడ్డు భద్రతా నియమాలు పాటించాలన్నారు. బైక్‌లు రోడ్డుకు అడ్డంగా పెట్టి ఎక్కడికో వెళ్లిపోతారని, ఇది సరైన పద్ధతి కాదన్నారు. అలాంటి వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడపరాదన్నారు. సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ, హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించకుండా, మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. ఇలా చేసిన వారికి జరిమానాతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ రమణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఫిర్యాదులపై వెంటనే స్పందించండి



మాట్లాడుతున్న ఏపీఎస్‌పీడీసీఎల్ సబ్‌డివిజన్ ఈఈ కెవివి రమణారెడ్డి

ఎర్రగుంట్ల : మీ పరిధిలో విద్యుత్ సరఫరాపై సమస్య ఉందని ఫిర్యాదు వచ్చిన వెంటనే సిబ్బంది స్పందించాలని ఏపీఎస్‌పీడీసీఎల్ సబ్ డివిజన్ ఈఈ కెవివి రమణారెడ్డి తెలిపారు. శనివారం పట్టణ పరిధిలోని ఎస్వీ కల్యాణ మండపంలో సబ్ డివిజన్ పరిధిలోని మూడు మండలాల విద్యుత్ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణ, గ్రామాలలోని విద్యుత్ సమస్యలపై, కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల, లైన్స్‌లు ఏర్పాటుపై సిబ్బందితో అయన చర్చించారు. అలాగే స్థానిక విద్యుత్ బకాయిల వసూళ్లపై దృష్టి పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో సబ్‌డివిజన్ ఏడీఈ కిరన్‌కుమార్, ఏఈ ప్రియదర్శిన్‌రెడ్డి, రూరల్ ఏఈ చంద్రశేఖర్, కమలాపురం ఎఈ చాంద్‌బాషా, వీఎన్‌పల్లి ఏఈ హరిప్రసాద్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

బ్రాహ్మణ సంక్షేమంపై దృష్టి పెట్టండి

వేంపల్లె : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం బ్రాహ్మణ సంక్షేమంపై దృష్టి సారించి బ్రాహ్మణులకు లబ్ధి కలిగేలా చర్యలు తీసుకోవాలని బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర ప్రచార కమిటీ అధ్యక్షుడు సూగురు రఘునాథ్‌రావు, ఆర్గనైసింగ్ సెక్రటరీ పీవీఎస్వీ ప్రసాదరావులు తెలిపారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ బ్రాహ్మణ నాయకులకు ప్రభుత్వ పదవులలో అవకాశం కల్పించాలని కోరారు.

పార్టీ అభ్యున్నతికి పనిచేస్తాం

పులివెందుల : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యున్నతికి బాధ్యతాయుతంగా పనిచేస్తానని వైఎస్సార్‌సీపీ పట్టణ ఉపాధ్యక్షుడు పార్నపల్లె కిశోర్ తెలిపారు. శనివారం పట్టణంలో ఆయన మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి పులివెందుల పట్టణ ఉపాధ్యక్షుడిగా నన్ను నియమించినందుకు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వైఎస్ భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు వైఎస్ మధురెడ్డి, దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానన్నారు.

ఉచిత కోచింగ్ ప్రారంభం



విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందిస్తున్న ఎంఈఓలు

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక సత్రంబడి ఉన్నత పాఠశాలలో శనివారం పాలిసెట్, ఏపీఆర్‌జేసీ ప్రవేశాల కొరకు నిర్వహిస్తున్న ఉచిత కోచింగ్‌ను ఎంఈఓలు చంద్రశేఖరరావు, రామానాయుడులు ప్రారంభించారు. ముందుగా వారు బాబూ జగ్జీవన్ రాం చిత్ర పటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉచిత విద్య ఉపాధ్యాయ బృందం రామకృష్ణయ్య, రామసుబ్బారెడ్డి, సుబ్బారెడ్డి, విజయానందన్‌రెడ్డి, స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షుడు రాజులు పాల్గొన్నారు.

ఎంపీకి ఆహ్వానం

మైదుకూరు: మైదుకూరు మున్సిపాలిటి పరిధిలోని శెట్టివారిపల్లె గ్రామ శివారులో వెలసిన గ్రామ దేవత శ్రీ పోలేరమ్మ తల్లి పునఃప్రతిష్ట మహోత్సవ వేడుకలకు హాజరుకావాలని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి వైఎస్సార్‌సీపీ నాయకులు ఆహ్వాన పత్రం అందజేశారు.

అలుపెరుగని సంఘ సంస్కర్త బాబు జగ్జీవన్ రాం



కమలాపురంలో బాబు జగ్జీవన్ రామ్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న రవీంద్రనాథ్ రెడ్డి



పులివెందులలో బాబూ జగ్జీవన్ రాం చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి



వేంపల్లెలో బాబూ జగ్జీవన్ రాం చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న అంబేడ్కర్ సేవా సమితి నాయకులు

కమలాపురం : సమాజంలో అణగారిన వర్గాల ప్రజల సంక్షేమం కోసం అహర్నిషలు కృషి చేసి అలుపెరుగని సంఘ సంస్కర్త బాబు జగ్జీవన్ రామ్ అని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. శనివారం జగ్జీవన్ రామ్ 117వ జయంతిని పురస్కరించుకుని స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అణగారిన వర్గాల ప్రజల సంక్షేమం కోసం అహర్నిషలు కృషి చేసిన సంఘ సంస్కర్త బాబు జగ్జీవన్ రామ్ అన్నారు. దేశ సేవకు తన జీవితాన్ని అంకితం చేసిన స్వాతంత్ర్య సమర యోధుడు అన్నారు. దేశ ఉప ప్రధానిగా, దాదాపు నాలుగు దశాబ్దాల పాటు మంత్రిగా అనేక శాఖలను సమర్థవంతంగా నిర్వహించి పరిపాలనా దక్షుడిగా ముద్ర వేయించుకున్న ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. సామాజిక అణచివేతలకు, కుల వివక్ష పట్ల నిరంతరం పోరాటం చేసిన ధీశాలి అని ఆయన అభివర్ణించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

పులివెందులలో..

పులివెందుల : బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి బాబూ జగ్జీవన్ రాం ఎంతో కృషి చేశారని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి తెలిపారు. శనివారం పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయంలో బాబూ జగ్జీవన్ రాం చిత్ర పటానికి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులకు పంచి పెట్టారు. అలాగే పట్టణంలోని స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బాబూ జగ్జీవన్ రాం చిత్ర పటానికి మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ డైరెక్టర్ హాలు గంగాధరరెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ చిన్నప్ప, వైఎస్సార్‌సీపీ నాయకులు రసూల్, వైఎస్సార్‌సీపీ పట్టణ ఉపాధ్యక్షుడు పార్నపల్లె కిశోర్, మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజ్, వైఎస్సార్‌సీపీ బూత్ కమిటీ రాష్ట్ర నాయకులు చంద్రమౌళి, సోషల్ మీడియా కన్వీనర్ వివేక్‌రెడ్డి, ఎస్సీ నాయకులు భాస్కర్, రామకృష్ణ, సూరి, కృష్ణమూర్తి, కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్ రాముడు, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

వేంపల్లెలో..

వేంపల్లె : అణగారిన సామాజిక వర్గాల అభ్యున్నతికి పాటుపడిన వ్యక్తి బాబు జగ్జీవన్ రాం అని అంబేడ్కర్ సేవా సమితి చైర్మన్ బందేల రామాంజనేయలు, ఉపాధ్యక్షుడు పుల్లయ్య, ఓబులేసు, నాగన్నలు తెలిపారు. బాబు జగ్జీవన్ రాం జయంతి సందర్భంగా శనివారం స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో బాబు జగ్జీవన్ రాం చిత్ర పటానికి అంబేడ్కర్ సేవా సమితి ఆధ్వర్యంలో దళిత సంఘాల నాయకులు, వైసీపీ, టీడీపీ, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు ఘనంగా పూలమాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుల అణచివేతలు, గుడ్డి ద్వేషాలు, అంధ విశ్వాసాలు, మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా సామాజిక సంస్కరణోద్యమాలలో జగ్జీవన్ రాం విశిష్టమైన స్థానాన్ని పదిలపరచుకున్నారన్నారు. బాబు జగ్జీవన్ రాం జయంతి రోజున కేంద్ర ప్రభుత్వం సమతా దివాస్‌గా పరిగణించడం జరిగిందన్నారు. జాతీయ భద్రతా, ఆహర భద్రత కల్పించడంలో ఆయన పాత్ర వెలకట్టలేనిదన్నారు. ఆయన రాజకీయ జీవితంలో బడుగు, బలహీన వర్గాల ఎదుగుదల కోసం నిరంతరం కృషి చేశారన్నారు. బాబు జగ్జీవన్ రాం గొప్ప దార్శనికుడు, దేశ భక్తుడని కొనియాడారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ మండల కన్వీనర్ వెంకటయ్య, ఎస్సీ సెల్ మండల ప్రధాన కార్యదర్శి ఈశ్వరయ్య, యుగంధర్, వైసీపీ ఎస్సీ సెల్ మండల కన్వీనర్ కమతం రాజా, వేముల కాంగ్రెస్ మండల కన్వీనర్ వెంకటేష్, కేశవ దేవదాసు, గొంగటి శేఖర్, రఫీ, అల్లా బకాష్, దర్బార్, తంగేడుపల్లె రాజాలతో పాటు పలువురు దళిత నేతలు, ప్రజా సంఘాల నేతలు పాల్గొన్నారు.

చింతకొమ్మదిన్నెలో..

చింతకొమ్మదిన్నె : మండలంలో ఎస్సీ, ఎస్టీ సంఘం నాయకులు మాతంగి సుబ్బరాయుడు, అట్లూరి సుబ్బరాయుడు ఆధ్వర్యంలో జగ్జీవన్ రాం చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మాతంగి సుబ్బరాయుడు మాట్లాడుతూ బాబు జగ్జీవన్ రాం బీహార్ రాష్ట్రంలోని చంద్వాలో 1908లో జన్మించి విద్యార్థి దశ నుండి ఎన్నో పోరాటాలు చేసి భారత స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొన్నారన్నారు. వ్యవసాయ శాఖ మంత్రిగా, రక్షణ శాఖ మంత్రిగా, ఉప ప్రధానమంత్రిగా పదవులను నిస్వార్థంగా నిర్వహించారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంఘం అధ్యక్షుడు సుబ్బరాయుడు, ఉపాధ్యక్షుడు పీజీ గంగయ్య, ఎస్సీ,ఎస్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు రూరల్ : దేశంలో అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాటం చేసిన మహనీయుడు భారత తొలి దళిత ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్ రాం అని పట్టణ సీఐ ఎస్.లింగప్ప అన్నారు. శనివారం ఆయన విగ్రహానికి ఘనంగా నివాళుల అర్పించారు. అనంతరం ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు పిచ్చికె బాబు మాట్లాడుతూ సమ సమాజ స్థాపనకు కృషి చేశాడన్నారు. ఆయన బాటలో ప్రతి ఒక్కరూ నడవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బడిగించల చంద్రమౌళి, మున్సిపల్ వైస్ చైర్మన్ మంగదొడ్డి సింగరయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉప్పలపాడు యోబు, ఎంఆర్‌పీఎస్ నాయకులు పాల్గొన్నారు.



చింతకొమ్మదిన్నెలో చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ, ఎస్సీ ఎస్టీ సంఘాల నాయకులు



జమ్మలమడుగులో నివాళులు అర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు